సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
మంగళవారం 26, డిసెంబర్ 2023
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం





# ఐఎన్ టియూసీతోనే సంక్షేమం సాధ్యం

- కార్మికులకు 250 గజాల ఇళ్ల స్థలం
- రూ 20 లక్షల వడ్డీ లేని రుణాలు
- గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి

2 లో..





కొత్తగూడెం సింగరేణి, సూర్య (మేజర్‌న్యూస్) - హోసింగరేణి సంస్థను ప్రైవేటీకరణకు చేపట్టే చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, 250 గజాల ఇళ్ల స్థలము, రూ 20 లక్షల వడ్డీ లేని రుణాలు అందజేస్తామని, డిపెండెంట్ నియామకాలలో దళారీ వ్యవస్థను అరికడతామని రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

## క్రిస్మస్ వేడుకల్లో మంత్రులు పొంగులేటి, తుమ్మల



2 లో..

## గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేస్ నే గెలిపించండి



4 లో..

## పండుగలు మత సామరస్యానికి దోహదం



3 లో..

# ఈ నెల 28 నుండి ప్రజా పాలన కార్యక్రమం

-నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలి
-ప్రతి రోజు రెండు షిఫ్టులలో గ్రామసభలు నిర్వహించాలి
- టెలి కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక



2 లో..

కొత్తగూడెం,సూర్య (మేజర్ న్యూస్ )- ఈ నెల 28 నుండి జనవరి 6 తేదీ వరకు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. ప్రజపాలన కార్యక్రమం నిర్వహణపై సోమవారం జిల్లా, నియోజక, మండల అదికారులు, మున్సిపల్ కమిషర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమం.నిర్వహణపై నేడు రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఖమ్మం కలెక్టరేట్ లో సమావేశం నిర్వహించనున్నారని నిర్దేశించిన అధికారులు హాజరుకావాలని చెప్పారు

# ఐఎన్ టియూసీతోనే సంక్షేమం సాధ్యం



సింగరేణి కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెం ఏరియా, కార్పొరేట్ ఏరియాలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ గత పాలకులు డిపెండెంట్ నియామకాల్లో దలారులకు కొమ్ము కాసిందని విమర్శించారు. దీనితో కార్మికులు నష్టపోయారని తెలిపారు. 2017లో సింగరేణి ఎన్నికలలో బిఆర్ఎస్ అనుబంధ సంస్థ కార్మిక సంఘం టీబీజీకేఎస్ సంఘాన్ని గెలిపించుకున్నామని గుర్తు చేశారు. బిఆరెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలుహా ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. కేసీఆర్ నిరంకుశత్వంతో సమస్యలపై కార్మికుల పక్షాన ప్రభుత్వంతో మాట్లాడే పరిస్థితి లేని దుస్థితి ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. హొతాజాగా జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో సింగరేణి కోల్బెల్ట్ ప్రాంతంలో 11 స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుందని అన్నారు. నేడు ఆ పరిస్థితి లేదనని తానే ఆ బాధ్యతను తీసుకుంటానని కార్మికులకు హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికులు చూపించిన ఆధార అభిమానులతో రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో కార్మికుల జీవితాలు మరింత మెరుగు పడతాయని స్పష్టం చేశారు. అధికారంలో లేని పార్టీ మాయమాటలు చెప్పి కార్మికులను మోసగించే ప్రయత్నం చేస్తుందని కార్మికులు దీన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు. టిబిజికెఎస్ వల్ల కార్మికులకు ఒరిగేదేమీ లేదని ఎద్దేవ చేశారు. సింగరేణి కార్మికులు చూపించిన ఆధార అభిమానులతో రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో కార్మికుల జీవితాలు బాగుపడతాయని, అధికారంలో లేని పార్టీ మాయమాటలు చెప్పి కార్మికులను మోసం చేసే ప్రయత్నం చేస్తుందని కార్మికులు దీన్ని గమనించాలన్నారు. మీ ఆదరాభిమానాలతో నేను ఈస్థాయిలో ఉన్నానని, మీ నమ్మకాన్ని వమ్ము చేయనని కార్మికులకు, కార్యకర్తలకు మీ కష్టసుఖాలలో అండదండగా ఉంటానని హామీనిచ్చారు.గత ప్రభుత్వం సింగరేణిలో కార్మికుల పేరు మార్పిడి చేయలేదని మన ప్రభుత్వంలో కచ్చితంగా సాధించుకుందామన్నారు.గత ప్రభుత్వంలో కారుణ్య నియామకాలలో దళారులకు రూ 4 లక్షల నుండి రూ 10 లక్షల వరకు లంచం తీసుకునే దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయనున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ దళారికి ఒక్క రూపాయి కూడా చెల్లించవలసిన అవసరం లేదని, విద్యా, వైద్యం కోసం సింగరేణి సంస్థతోపాటు ప్రభుత్వం అన్ని విధాలుగా కార్మికుల పక్షాన ఉంటుందని తెలిపారు.ఇన్కమ్ టాక్స్, అలవెన్స్ వాటిపై విధించే వడ్డీలను యాజమాన్యమే చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని, రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పట్టాలని ఆ విధంగా కేంద్రంలో సింగరేణి సంస్థకు చేయాల్సిన విధివిధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు.డిసెంబర్ 23వ తేదీన సింగరేణి దినోత్సవ సందర్భంగా సెలవును రోజుగా ప్రకటిస్తామని, రాష్ట్రంలో కొత్త భూగర్భ గానులను ప్రారంభిస్తామని,విద్యావంతులైన కార్మికులకు తమకు సూటబుల్ అయిన ఉద్యోగాలు, మహిళా కార్మికులకు అనువైన ఉద్యోగాలు కల్పిస్తామని హామీనిచ్చారు.సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ దిశగా చేపట్టే చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు సింగరేణి సంస్థలో 60 వేల కార్మికులు ఉండేవారు, 2023 వరకు 39,250 ఉద్యోగస్తులకు చేరిందని, సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు.కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక అనుబంధ సంస్థ ఐఎన్టీయూసీ ఎన్నికల గుర్తు గోడగడియారం గుర్తుకి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కార్మికులను కోరారు.అనంతరం వివిధ కార్మిక సంఘాల నుండి వచ్చిన కార్మికులకు ఐఎన్టీయూసీ సంఘం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమాల్లో ఐఎన్టీయూసీ జనరల్ సెక్రెటరీ త్యాగరాజన్, ఎ. కనకరాజు, డాక్టర్ శంకర్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్,ఎం.డి రజాక్, కాంగ్రెస్ నాయకులూ కొత్వాల శ్రీనివాస్, ఐ.ఎన్.టి.యు.సి, నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**-చర్చిల్లో ప్ర త్యేక ప్రార్థనలు**

**-కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కోరం కనకయ్య**

**-ఏసుక్రీస్తు బోధనలు, ఆరాధనలతో మార్మోగిన చర్చిలు**

**-హితబోధ చేసిన ఆయా చర్చిల పాస్టర్లు**





టేకులపల్లి సూర్య (మేజర్ న్యూస్ ): మండలంలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రాలతో పాటు పల్లెలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆర్ సి ఎం చర్చిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన ల్లో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏసు ప్రభువును కొలుస్తూ భక్తులు ఆలాపించిన దైవభక్తి గీతాలు, కీర్తనలు అలరించాయి. ఈ సందర్భంగా పాస్టర్లు ఏసుక్రీస్తు జన్మదిన విశిష్టతను వివరించారు. ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య టేకులపల్లి మండల కేంద్రంలో గోలియా తండా పంచాయతీ బి కాలనీ తండా గ్రామంలో పెంతే కోస్తూ ప్రార్ధన మందిరంతో పాటు పలు చర్చిలలో క్రిస్మస్ పండుగ సందర్భంగా అందరికీ శాంతి సమాధానం సౌభాగ్యాలను కలుగజేయాలని కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. రక్షకుడు మన అందరి కొరకు పుట్టియున్నాడని ఆయన ప్రభువైన ఏసుక్రీస్తు త్యాగానికి ప్రేమ కరుణ లతో ప్రపంచానికి కొత్త మార్గం నిర్దేశించిన ఏసుక్రీస్తు జన్మదిన మన మండలంలో క్రైస్తవ కుటుంబాలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జి రాజు ,రామచందర్, జి సోనీ. సంఘ పెద్ద చింత కనకరాజు, చింతా దేవమ్మ ,సంఘ సభ్యులు చిన్నపిల్లలు పాల్గొన్నారు.

## సాంఘిక దురాచారాలను అంటరానితనాన్ని రూపుమాపండి

టేకుల్లపల్లి, సూర్య (మేజర్ న్యూస్ ) - మహిళలలు, దళితులపై , సాంఘిక దురాచారాలను అంటరాని తనాన్ని రూపుమాపలని హిందూ బ్రాహ్మణీయ మనువాద భావజాలాన్ని, మనుస్మృతిని దహనం చేయాలని మాక్స్ అంబేద్కర్ అధ్యయన వేదిక తెలంగాణ ప్రజా ఫ్రంట్ వేదిక రాష్ట్ర కార్యదర్శి మెంతేన ప్రభాకర్ అన్నారు. సోమవారం బోడు రోడ్ సెంటర్లో మనస్మృతి నీ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 1927 డిసెంబర్ 25వ తేదీన అంటరానితనానికి వ్యతిరేకంగా బాబాసాహెబ్ అంబేద్కర్ అతని అనుచరులు కలిసి మనస్మృతిని దహనం చేశారని, మహారాష్ట్ర కొంకండ్ ప్రాంతం రాయగడ జిల్లాలోని మహద్ అనే చిన్న పట్టణంలో కొన్ని వేల మంది దళితులను మహిళల సమక్షంలో ఈ దహన కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. దేశంలో కులం పేరుతో మహిళలపై దళితులపై సాంఘిక దురాచారాలను అంటరానితనాన్ని ఆకృత్యాలను అరాచకాలను పెంచి పోషించే హిందూ బ్రాహ్మణయ్య మనువాదాన్ని మనుస్మృతిని దహనం చేయాలనే పిలుపు ఇచ్చిన స్ఫూర్తి తో 100 ఏళ్ళు గడిచిన మహిళలపై దళితులపై అదే వివక్షత కొనసాగుతున్న సందర్భంగా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాక్స్ అంబేత్కర్ అధ్యయన వేదిక రాష్ట్ర కార్యదర్శి మెంతేన ప్రభాకర్ ,కళ్ళ రంజిత్ , రాము తెలంగాణ ప్రజా ఫ్రెంట్ జిల్లా నాయకులు ఎట్టి ప్రశాంత్ పాల్గొన్నారు.



## క్రిస్మస్ వేడుకల్లో మంత్రులు పొంగులేటి, తుమ్మల



**ఖమ్మం సూర్య మేజర్ న్యూస్** నగరంలోని చర్చికాంపౌండ్ లోని సీఎస్ఐ చర్చి లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తెలంగాణ వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక ప్రార్థన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ఫాదర్, బిషప్ లు ఈ సందర్భంగా ఇద్దరి మంత్రులకు ఆశీర్వచనలను అందచేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ముందుగా క్రైస్తవ సోదరులకు ప్రత్యేకంగా క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. యేసు క్రీస్తు చల్లని చూపు తెలంగాణ ప్రజలు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల మీద ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు.

## ఈ నెల 28 నుండి ప్రజా పాలన కార్యక్రమం

ఈ నెల 28 వ తేదీ నుండి జనవరి 6 వరకు నిర్వహించనున్న ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణపై ఉమ్మడి ఖమ్మం జిల్లా సన్నాహక సమావేశంమంగళవారం ఖమ్మం కలెక్టరేట్ లో నిర్వహించనున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, ఎంపిడిఓ లు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, డివిజన్ స్థాయి అధికారులు హాజరుకావాలని చెప్పారు. ఈ సమావేశం లో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణపై మంత్రి అవగాహన కలిగిస్తారన్నారు.ప్రజా పాలన కార్యక్రమం 8 పని దినాలలో నిర్వహించాల్సి ఉన్నట్లు, ప్రతి రోజు రెండు షిఫ్టులలో గ్రామసభలు నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒకటి, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఒకటి నిర్వహించుటకు షెడ్యూల్ తయారు చేయాలని చెప్పారు. ప్రభుత్వ సెలవు రోజులు అనగా డిసెంబర్ 31, జనవరి 1 మినహాయించి డిసెంబర్ 28 నుండి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించాలన్నారు. ప్రజా పాలన కార్యక్రమం గ్రామీణ ప్రాంతంలోని ప్రతి గ్రామ పంచాయతీలోను, పట్టణ ప్రాంతంలోని ప్రతి మున్సిపల్ వార్డులోను నిర్వహించాలని చెప్పారు.మహాలక్ష్మి పథకం,.రైతు భరోసా పథకం,.గృహ జ్యోతి పథకం, ఇందిరమ్మ ఇండ్లు పథకం, చేయూత పథకాలలో ప్రజా పాలనలో దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. జిల్లాలో నేడు నిర్వహించనున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజా ప్రజాపాలన సన్నాహక సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 481 గ్రామ పంచాయతీలు, 4 మున్సిపాలిటీలల్లో నిర్వహణకు షెడ్యూల్ తయారు చేసినట్లు చెప్పారు. ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణలో భాగంగా ప్రతి రోజు వచ్చిన దరఖాస్తులు ఆన్లైన్ తో పాటు నివేదికలు అందచేయాలని అధికారులకు సూచించారు.ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు డా రాంబాబు, మధుసూదన్ రాజు, డిపిఓ రమాకాంత్, జడ్పి సీఈవో విద్యాలతతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

## రైతు బంధును వెంటనే విడుదల చేయాలి

**-ఆపదలో ఉన్న రైతన్న ఆదుకోవాలి**

టేకులపల్లి, సూర్య (మేజర్ న్యూస్) - ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు కావస్తున్న ఇంతవరకు రాష్ట్రంలో రైతులకి రైతుబంధు పడలేదని ఎకరం ఉన్న వాళ్లకు మాత్రమే వేశారని మిగతా రైతులకు వేయక పోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విపత్కర పరిస్తితుల వల్ల వచ్చిన తుఫానుల వల్ల గాలి వానల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయి ఉన్నారని, యాసంగి పంట వేసుకుందామంటే చేతిలో రూపాయి కూడా లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారని తక్షణమే రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుబంధు మీద ఆధారపడే కొంతమంది రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారని అన్నారు. గతంలో వచ్చిన తుఫాను వలన ఈదురు గాలుల వలన నష్టపోయిన రైతులని ఆదుకోవాలని ,పెండింగ్లో ఉన్న రైతుబంధును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# పండుగలు మత సామరస్యానికి దోహదం

**-క్రైస్తవ జీవన విధానం పవిత్రమైంది**
**-క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**కొత్తగూడెం టౌన్,సూర్య (మేజర్ న్యూస్) –** పండుగలు, ఉత్సవాలు మత సామరస్యంతోపాటు ప్రజలలో ఐక్యతను పెంపొందిస్తాయని కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని సోమావారం పట్టణంలోని పలు చర్చలను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు పాల్గొన్నారు. అనంతరం క్రైస్తవ సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రజల్లో మమేకమయ్యే నాయకుడిగా తనను గుర్తించి గెలిపించిన క్రైస్తవ కుటుంబాలకు నియోజకవర్గ ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని ఎలాంటి అవసరతలు ఇచ్చిన తన తలుపు తట్టాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి గతం కంటే రెట్టింపు ఉత్సాహంతో తన కర్తవ్యం నిర్వహిస్తానని స్పష్టం చేశారు ప్రజాస్వామ్య దేశంలో పండుగులను కులమతాలకతీతంగా జరుపు కోవాలన్నారు. పండుగల సందర్భంగా పేదలకు, అనాథలకు సాధ్యమైనంత సహాయం చేసి ఉత్సవాల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. క్రైస్తవ జీవన విధానం పవిత్రమైందని, సమాజంలో శాంతిని నెలకొల్పేందుకు క్రైస్తవ భోదకులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా, నాయకులు కంచర్ల జమలయ్య మునిగడప వెంకటేశ్వర్లు భూక్య శ్రీనివాస్ మునిగడప పద్మ వినయ్, పద్మారావు, క్రిస్టఫర్, మల్లయ్య, కెనడి, వాట్సన్ పాల్గొన్నారు.



## ఘనంగా క్రిస్టమస్ వేడుకలు



బూర్గంపాడు, సూర్య (మేజర్ న్యూస్) – మండలంలో బూర్గంపాడు, సారపాక మోరంపల్లి బంజర్, రెడ్డిపాలెం, సోంపల్లి, ముసలమడుగు, గ్రామాలలో సోమవారం క్రిస్టమస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయకాలం నుండి కుటుంబ సమేతంగా చర్చిలలోకి వచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సోంపల్లి గ్రామంలోని బేతేలు ప్రార్థన మందిరంలో పాస్టర్లు పండగ జోసెఫ్ రాజ్, బర్ల వెంకటరత్నం వాక్యోపదేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ లోకములో పాపము, అపరాధముతో ఉన్నవారిని రక్షించడానికి కన్యకైనా మరియమ్మ గర్భమందు ఏసుక్రీస్తు జన్మించినాడు. ప్రతి ఒక్కరూ ఆయన సూపిన మార్గంలో నడుచుకున్న ఎడల వారి జీవితాలలో శాంతిని, నెమ్మదిని, సమాధానము, ఆనందము కలుగుతుందన్నారు

## శివాలయంలో రుద్ర హెూమం..



అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్)– మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో సోమవారం రుద్ర హెూమం నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, గోత్రనామార్చనలు నిర్వహించారు. స్వామివారి రుద్ర హెూమం, అన్నదాన కార్యక్రమంలో వి ఎల్ బి వెంకట్రావు– సుగుణావతి దంపతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసే సోమవారం అన్నదాన కార్యక్రమానికి అన్నదాతలుగా పాల్గొనదలచిన భక్తులు ఆలయ సిబ్బంది సెల్ నెం 9959108107 ను సంప్రదించాలని కోరారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు





గుండాల, సూర్య (మేజర్ న్యూస్)– మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలోని చర్చిలలో సోమవారం క్రైస్తవ సోదరులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. లోక రక్షకుడు ఏసుక్రీస్తు చూపెట్టిన సన్మార్గంలో నడిచి ఆయన కృపను పొందాలని మత పెద్దలు, పాస్టర్లు సూచించారు. క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో క్రైస్తవ మత పెద్దలు, పాస్టర్లు, క్రైస్తవ సోదర, సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీస్తును ఆరాధించడమే నిజమైన క్రిస్మస్

**–లింగాపురం, కొత్తపల్లి రాక్ చర్చి దైవజనులు ఎల్ ప్రేమానందం.**

చర్ల, సూర్య (మేజర్ న్యూస్)– క్రీస్తును ఆరాధించడమే నిజమైన క్రిస్మస్ అని లింగాపురం రాక్ చర్చ్ నిర్వాహకులు దైవజనులు లంకా ప్రేమానందం అన్నారు మండల వ్యాప్తంగా సోమవారం చర్చిలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. లింగాపురం కొత్తపల్లి గ్రామాలకు సంబంధించిన రాక్ చర్చి నిర్వాహకులు ఆ చర్చి దైవజనులు ఎల్ ప్రేమానందం ఆధ్వర్యంలో సంఘ పెద్దలు సంఘ సభ్యుల నడుమ కేకును కట్ చేసి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ ప్రేమానందం మాట్లాడుతూ సర్వ మానవాళి కోసం ఏసుక్రీస్తు జన్మించారని క్రీస్తు పండుగ ఎంతో పవిత్రమైందని క్రీస్తు జన్మదిన వేడుకలు ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవడం ఎంతో ఆనందకరమన్నారు. కరుణ ప్రేమ దయా గుణాలతో ఉండాలని నీ వలే నీ పొరుగు వాని పట్ల ప్రేమకలిగి ఉండాలని మానవులంతా శాంతి మార్గంలో జీవించాలని, క్రీస్తు మార్గములో నడిచేవారు చెడుకు దూరంగా ఉంటారని కుటుంబం పట్ల సమాజం పట్ల ప్రేమ కలిగి జీవిస్తారని బోధించారు. అనంతరం ఒకరి కొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకొని స్వీట్లు పంచిపెట్టారు. మందిరంలోక్రిస్మస్ గీతాలతో, సంగీత ధ్వనులతో చప్పట్లతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో రాక్ చర్చి సంఘ పెద్దలు బూరుగడ్డ బసవయ్య, కర్రి మోహన్ రావు ఎడెల్లి గణపతి, అంబోజి బాబురావు, కొంగూరి ఏసు, కుందమల్ల శ్రీనివాసరావు, నక్క సాంబశివరావు, తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.



## సింగరేణి స్థలాన్ని కబ్జా కోరల్లో నుండి కాపాడాలి

**–చోద్యం చూస్తున్న అదికారులు**
**–బీఎస్పీ అసెంబ్లీ ఇంచార్జ్ యెర్రా కామేష్**

చుంచుపల్లి,సూర్య (మేజర్ న్యూస్) – నియోజకవర్గంలో కోట్ల రూపాయల సింగరేణి స్థలాలు కబ్జాలకు గురి అవుతున్నా సింగరేణి అదికారులు చోద్యం చూస్తున్నారని బహుజన్ సమాజ్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ యెర్రా కామేష్ విమర్శించారు.సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి మండల తహశీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో కబ్జాకు గురైన సింగరేణి స్థలాన్ని సందర్శించారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి స్థలాలను కాపాడటంలో అదికారులు పూర్తిగా విఫలమవుతున్నారని గతంలో ఇక్కడ ఉన్న సింగరేణి క్వాటర్ కూలిపోవడంతో సదరు ఖాళీ స్థలం పై కన్నేసిన కబ్జా దారులు ఖాళీ స్థలాన్ని చదును చేసి స్థంబాలు పాతి ఆటలు ఆడటం కోసం అని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని,సదరు స్థలంపై కన్నేసిన పాఠశాల యజమాని స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.సింగరేణి అదికారులు తక్షణమే స్పందంచి కోట్ల రూపాయల విలువైన స్థలాలను గుర్తించి కబ్జాలకు గురి కాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని డిమండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున రావు,అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్,మాలోత్ వీరు నాయక్,వంగా రవిశంకర్,పోలే కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో క్రిస్టమస్ వేడుకలు..



అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్న్యూస్) – మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం క్రిస్టమస్ పండగ సందర్భంగా క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చులు విద్యుత్ దీపాలు, క్రిస్మస్ట్రీలతో అందంగా అలంకరించారు. చిన్న పెద్దలందరూ మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్ కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలిపారు. పలు గీతాలు ఆలపించి చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాస్టర్లు ఏసుక్రీస్తు జన్మదిన విశిష్టతను వివరించారు. ఏసుప్రభువు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడిచి ప్రపంచశాంతికి మార్గదర్శకాలు కావాలన్నారు.

# ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తాం

**– రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.**



ఇల్లందు టౌన్, సూర్య, (మేజర్ న్యూస్) – కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తూచా తప్పక నెరవేరుస్తామని సింగరేణి లో ఉద్యోగాలు కల్పించేందుకు జెకె ఫైవ్ ఓ సి మైన్ ఎక్స్టెన్షన్ తో పాటు కోయగూడెంలో ఫిట్ 3 ఓపెన్ ప్రారంభించెందుకు సన్నాహాలు నా కార్మికుల సోదరులను బదిలీపై వేరే ప్రాంతాల పంపకుండా ఇక్కడే ఉండేటట్టు కార్మిక సోదరులకు హామీ ఇస్తున్నాని రాష్ట్ర రెవెన్యూ శాఖ, గృహ నిర్మాణశాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈనెల 27న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సింగరేణి కార్మికుల ఎన్నికలు జరగనున్న సందర్భంగా సోమవారం మంత్రి. జీకే ఓ సి మైన్ లో నిర్వహించిన ఫిట్ మీటింగ్ లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పారీ ఇచ్చిన హామీలో భాగమైన సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని అందులో భాగంగా ఇల్లందు కోయగూడెం సింగరేణి గనులలో ఫీట్ 3 మైన్ ఓపెన్ చేసి ప్రస్తుతం ఉన్న 600 కార్మికుల సంఖ్యను నాలుగు సంఖ్యల అంకె తొ నింప నున్నట్లు ఆయన పేర్కొన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ఆశీర్వాద బలంతో అధికారంలోకి వచ్చిన ఇందిరమ్మ రాజ్యంలో కార్మికుల సొంతింటి కల ను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చనున్నదని ఇంటి స్థలంతో పాటు వడ్డీ లేని రూ 20 లక్షల రుణాన్ని ప్రతి కార్మికుడికి అందించనున్నామని ఆయన పేర్కొన్నారు. రానున్న ఐదు సంవత్సరాలు కాంగ్రెస్ అధిష్టానం సోనియమ్మ ఇచ్చిన 6 గ్యారంటీ పథకాలను తప్పక నెరవేస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మరుక్షణమే ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలలో రెండు హామీలను నెరవేర్చామని,మరో రెండు హామీలను సహితం నెరవేర్చబోతున్నామని ఆయన ప్రకటించారు. ఎమ్మెల్యేలకు మంత్రులకు సైతం అపాయింట్మెంట్ ఇవ్వని, సామాన్యుల సమస్యలను చెప్పేందుకు అవకాశం ఇవ్వని కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు నేలకేసి కొట్టారని పొంగులేటి అన్నారు. కాంగ్రెస్ ఇందిరమ్మ రాజ్యంలో ప్రగతిభవన్ ను ప్రజాభవన్ గా మార్చామని ప్రజల సమస్యలను వినేందుకు ప్రజా దర్బార్ ఉంటుందని పేర్కొన్నారు. కెసిఆర్ ప్రభుత్వ అహంకార నిరంకుశ ధోరణిని ప్రజలు గ్రహించి రాష్ట్రవ్యాప్తంగా మార్పు కోరి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చారని తెలిపారు. సింగరేణి భవిష్యత్తు కోసం కార్మికుల హక్కుల సాధన, సౌకర్యాలను పొందేందుకు గడియారం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్మికులను కోరారు. ప్రజలకు కావలసిన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కనకయ్య మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని సమస్యలను పరిష్కరించేందుకుకృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లాకు ముగ్గురు మంత్రులను కలిగి ఉండటం



అదృష్టంగా భావిస్తున్నానని మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు సలహా సంప్రదింపులతో సహకారాలతో ఇల్లందు నియోజకవర్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి అభివృద్ధి పరుస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఐ ఎన్ టి యు సి ఏరియా ఉపాధ్యక్షుడు లింగాల జగన్నాథం, జె. వెంకటేశ్వర్లు,పట్టణ మండల కాంగ్రెస్ ప్రముఖ నాయకులు డానియల్, పులి సైదులు, దల్ సింగ్, చిల్ల శ్రీనివాస్, బొల్ల సూర్యం, మడుగు సాంబమూర్తి, కోటిరెడ్డి, కొండూరి చిన్న, మహమూద్, ఎంపీటీసీలు మండల రాము కోరం సురేందర్, మహిళా నాయకురాలు స్వాతి,కల్తీ పద్మ, తాటి బిక్షం, తాటి చుక్కమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పై పోరాడే సిఐటియు నే గెలిపించండి



**– అబ్దుల్ నబి.**

ఇల్లందు టౌన్,సూర్య (మేజర్ న్యూస్) – నిరంతరం మీ వెంటే ఉంటు సమస్యలపై పోరాడే సీఐటీయూ సంగమని సంఘం గుర్తు ఉదయించే సూర్యునికే ఓటేసి గెలిపించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నవి అన్నారు. సోమవారం డి బ్లాక్ పిక్ మీటింగ్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణి లో సిఐటియు గెలవాలని మార్పు రావాలని ఆయన అన్నారు. రాబోయే సింగరేణి ఎన్నికల్లో సిఐటియు 12 హామీలతో ముందుకు వచ్చిందని, ప్రధానంగా సొంత ఇంటి అమలు నెరవేరుస్తామని ఇన్కమ్ టాక్స్ రియంబర్స్మెంట్ ఇప్పిస్తామని పేర్కొన్నారు. సింగరేణి కాలనీలలో మౌలిక వసతులు సింగరేణి మైన్ ల లో క్యాంటీన్లలో ఆధునికరించి నిర్వహిస్తామని, సింగరేణి కార్మికులు తన రక్షణ పరికరాలను తన వస్తువులను ఉంచడం కోసం లాకర్ ఫెసిలిటీ కల్పిస్తామని తెలియజేయ చేశారు. రానున్న రోజుల్లో సిఐటియు ఇచ్చిన ప్రతి హామీని తప్పక నెరవేరుస్తామని తెలిపారు. ఇప్పటివరకు సింగరేణి కార్మికుల కోసం ఎన్నో పోరాటాలు చేసి విజయం సాధించామని సీఎంపిఎఫ్ వడ్డీని సాధించామని, కార్మికులకు మంచినీటి సౌకర్యం అందించే విధంగా పోరాడి సాధించామని, ఎన్నో హక్కులు సిఐటియు పోరాడి సాధించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రానున్న ఎలక్షన్లలో ఉదయించే సూర్యుని గుర్తుకు ఓటు వేసి సిఐటియుని కార్మికులు గెలిపిస్తారని కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ల శంకర్, అబ్బాస్, తాళ్లూరి కృష్ణ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రేమ దాస్ ఆధ్వర్యంలో చీరల పంపిణి



ములకలపల్లి,సూర్య (మేజర్ న్యూస్)– క్రిస్టమస్ సందర్భంగా ములకలపల్లి మండలంలో బాప్టిస్ట్ చర్చి పాస్టర్ ప్రేమ దాస్ ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యులు డాక్టర్ కొమ్ము నాగరాజు సోమవారం చీరలను పంపిణి చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీస్తు బోధించిన ప్రేమ తత్వము కరుణాక్షేమ సంపూర్ణ మానవత్వమే మనిషిని దైవ స్వరూపుడిగా మారుస్తుందన్నారు. ఏసుప్రభు చూపినటువంటి ప్రేమ మార్గాన్ని కరుణ మానవాళి మనుగడకు పునాది ఆయన అనుసరించినటువంటి మార్గంలో ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలన్నారు.అనంతం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శనగపాటి సీతారాములు, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేస్ నే గెలిపించండి



**–మాజీ ఎమ్మెల్యే వనమా**



కొత్తగూడెంసింగరేణి,సూర్య (మేజర్ న్యూస్)– ఈనెల 27న జరగబోయే సింగరేణి కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేస్ బాణం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కార్మికులను కోరారు. సోమవారం స్థానిక రామవరంలోని టీబీజీకేస్ కార్యాలయంలో కార్మికుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో వనమా మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో అనేకమైన హక్కులు సాధించుకోవడం జరిగిందన్నారు. గతంలో జాతీయ సంఘం నాయకులు హక్కులన్నీ హరించినా కూడా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రావడంతో పోయిన డిపెండెంట్ ఎంప్లాయ్మెంట్ ద్వారా 20 వేల ఉద్యోగాలు తిరిగి తీసుకొచ్చింది ఘనత టీబీజీకేసిదే అని పేర్కొన్నారు. ప్రతి ఒక్క సింగరేణి కార్మికుడు టీబీజీకేస్ బాణం గుర్తు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం జీకే సంపత్ కుమార్ ని యూనియన్ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, చుంచుపల్లి ఎంపీపీ భగవత్ శాంతి, కొత్తగూడెం మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, టీబీజీకేస్ 11 మెన్ సభ్యులు కాపు కృష్ణ, టీబీజీకేస్ రీజినల్ సెక్రటరీ కూసన వీరభద్రం, గడప రాజయ్య, మొరే రమేష్, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ మోరే భాస్కర్, విద్యార్థి విభాగ అధ్యక్షులు అనుదీప్, ఆత్మ కమిటీ డైరెక్టర్ నిమ్మల సాగర్, టిఆర్ఎస్ జిల్లానాయకులు రాసపెల్లి రాజేంద్రప్రసాద్ ,టీబీజీకిస్ బ్రాండ్ సెక్రటరీ గడప రాజయ్య, సింగరేణి కార్పొరేట్ యూనియన్ నాయకులు మోర రమేష్, కనుకుంట్ల శీను, అశోక్, శివ, లిక్కి చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు మున్సిపల్ కౌన్సిలర్స్, తదితరులు పాల్గొన్నారు.

# ఏసుక్రీస్తు సందేశం ప్రపంచ మానవాళికి గొప్ప సందేశం

**–టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు**

పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్ ) భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వానికి, మతసామరస్యానికి ప్రతీక క్రిస్మస్ పండుగ, ప్రేమ దయా కరుణ జాలి క్రీస్తు సందేశం అని, క్రీస్తు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాలని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు అన్నారు.సోమవారం పాల్వంచలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిథిగా అయన పాల్గొని కేక్ కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నిర్వహకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు జన్మదిన అందరికీ పవిత్రమని, యేసు లోకాన్ని ఉద్ధరించడానికి అవతరించాడని, ప్రభువైన యేసు మానవాళికి ఆదర్శనీయుడన్నారు. అందరూ క్షమాగుణం, సేవా భావం,మానవత్వం కలిగి ఉండాలన్నారు. ఏసుక్రీస్తు దీవెనలతో అందరు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, కుల మతాలకతీతంగా మెలగాలని కోరారు.



# హ్యాపీ.. హ్యాపిగా క్రిస్మస్..!

**సామూహిక గీతాలాపనలతో మార్మోగిన ప్రార్థనామందిరాలు ఆర్సిఎం చర్చి క్రిస్మస్ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సి.ఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని విక్రమార్క**









**మధిర :సూర్య( మేజర్ న్యూస్)**

ఏసుక్రీస్తు జన్మదిన సందర్భంగా క్రిస్మస్ వేడుకలను సోమవారం మధిర లో క్రైస్తవులు సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే క్రైస్తవుల ఇళ్లలో పండగ వాతావరణం కనిపించింది. అన్ని చర్చీలను క్రిస్మస్ వేడుకల సందర్భంగా ముస్తాబు చేశారు. గత రెండు రోజులుగా చర్చీలు విద్యుత్ దీపాల అలంకరణతో వెలిగిపోతున్నాయి. ఇక క్రైస్తవుల ఇళ్ల వద్ద క్రిస్మస్ చెట్టు, నక్షత్రంను వేలాడదీశారు. పండగ సందర్భంగా చర్చీలకు క్రైస్తవుల తాకిడి కనిపించింది. అన్ని చర్చీలలో ప్రత్యేక క్రిస్మస్ ప్రార్థనలు జరిగాయి. క్రైస్తవ సోదరులు భారీ సంఖ్యలో ఈ ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. కుటుంబ సమేతంగా క్రైస్తవులు క్రిస్మస్ ప్రార్థనలకు వచ్చారు. ముఖ్యంగా మధిరలోని ఆర్ సి ఎం చర్చి క్రిస్మస్ వేడుకల సందర్భంగా కిక్కిరిసి కనిపించింది. ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని పాల్గొని కేకు కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా మల్లు నందిని మాట్లాడుతూ... క్రిస్టమస్ సందర్భంగా తెలంగాణలోని ప్రజలందరూ సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలతో జీవించాలని ఏసుప్రభువును ప్రార్థించి చర్చిలో అందరికీ శుభాకాంక్షలు తెలిపినారు అందరూ కలిసి ఏసును భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. ప్రత్యేక క్రిస్మస్ ప్రార్థనలు చేశారు. అనంతరం నిర్వహించిన క్రిస్మస్ గీతాలాపన కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. ప్రార్థనల అనంతరం అన్ని చర్చిలతో గీతాలను ఆలపించారు. సామూహికంగా గీతాలను ఆలపించి క్రిస్మస్ పండగను మరింత ఉత్సాహంగా జరుపుకున్నారు. మధిరలోని దాదాపుగా అన్ని చర్చీల వద్ద క్రైస్తవులు కంటుంబ సభ్యులతో వచ్చి వేడుకలు జరుపుకున్నారు. క్రైస్తవ మహిళలు సైతం భారీ సంఖ్యలో చర్చీలకు తరలి వచ్చి ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. చర్చీలలో ప్రార్థనల అనంతరం ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి. మాజీ మార్కెట్ చైర్మన్ రంగా హనుమంతరావు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దారా బాలరాజు తూమాటి నవీన్ రెడ్డి మండల నాయకులు కర్నాటి రామారావు. పారుపల్లి విజయ్ కుమార్ పాటిబండ్ల సత్యంబాబు. నిడమానూరి వంశీ ఎస్కే జాంగిర్ మొండితోక సుధాకర్ అద్దంకి రవికుమార్. టీవీ రెడ్డి. పులిబండ్ల చిట్టిబాబు. చెరుకూరి నాగార్జున. ఆదిమూలం శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు,,,,,,

## సామాజిక సేవలో 'భాగం ఫౌండేషన్'

**ఆర్ సి ఎం చర్చికి రూ 15,000 ల విలువైన ఆమ్ప్లిఫైర్ సౌండ్ సిస్టం వితరణ**

**భవిష్యత్తులో కూడా భాగం ఫౌండేషన్ సేవలను ముందు వరుసలో ఉంచుతాం**



**బోనకల్ సూర్య (మేజర్ న్యూస్):** సామాజిక సేవలు ద్వారా గ్రామాల్లోని పేదల నాదుకుంటూ వారికి అండగా ఉండటమే భాగం సేవా ఫౌండేషన్ లక్ష్యమని భాగం సేవా ఫౌండేషన్ సభ్యులు భాగం రాధాకృష్ణ అన్నారు క్రిస్మస్ పర్వదిన సందర్భంగా మండలంలోని గోవిందాపురం (ఎ) గ్రామంలో సోమవారం తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్ సీ ఎం చర్చికి రూ. 15,000ల విలువైన ఆమ్ప్లిఫైర్ సౌండ్ సిస్టమ్ ను చర్చి నిర్వాహకులకు వితరణగా అందించారు. ఈ సందర్భంగా సేవ ఫౌండేషన్ సభ్యులు భాగం రాధాకృష్ణ మాట్లాడుతూ మండలంలోని మూడు గ్రామ పంచాయతీలలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వీధిలైట్లు అందించామన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో తమ ఫౌండేషన్ ద్వారా కరోనా పై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ సేవా కార్యక్రమాలను చేపట్టామన్నారు. గ్రామాల్లోని క్రీడా నైపుణ్యం ఉన్న బాలబాలికలకు ఫౌండేషన్ ద్వారా ప్రోత్సహిస్తున్నామన్నారు. గోవిండాపురం (ఎ) గ్రామంతో పాటు చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో సైతం భాగం సేవా ఫౌండేషన్ కార్యక్రమాలు చురుగ్గా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా సేవలు అందించేందుకు 'భాగం సేవ ఫౌండేషన్' ముందు వరుసలో ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు భాగం పాపారావు, మండల నాయకులు భాగం నాగేశ్వరరావు, కావూరి వెంకటరావు, గుండపునేని రాజేంద్ర బాబు, ఎస్కే రంజాన్, గండమాల రాయప్ప శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ నాయకులు

సూర్య వైరా టౌన్(డిసెంబర్25):- ప్రపంచ మానవులందరికి ప్రేమను,కరుణను పంచిన యేసుక్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా డిసెంబర్ 25న క్రిస్మస్ పండుగ నిర్వహించుకునే క్రైస్తవులందరికీ బిఆర్ఎస్ పార్టీ నాయకులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు విశ్వమానవ సహోదరత్వానికి దోహదం చేశాయని పేర్కొన్నారు. చాటారన్నారు.అనంతరం పార్టీ బలోపేతమే లక్ష్యంగా మండల పరిధిలోని పాలడుగు గ్రామంలో షేక్ ఇబ్రహీం నివాసంలో పార్టీ సమావేశం నిర్వహించారు.నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అందరూ రానున్న స్థానిక ఎన్నికలను దృష్టి లో పెట్టుకొని పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు.జిల్లా కేంద్రంలో గులాబీ జెండా ఎగరవేస్తామని ఎగురుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఇరుపార్శపు భాస్కర్ రావు,మండల నాయకులు రాయల కిరణ్, ఉపసర్పంచ్ గుండెపోగు జాన్,గ్రామాధ్యక్షుడు ఆరెపల్లి సీతారాములు,శీలం వెంకటరెడ్డి,కోసూరి రామకృష్ణ,పఠాన్ కరిముల్ల,షేక్ బాబు సాహెబ్,యాకుబలి తదితరులు పాల్గొన్నారు.



## క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే సండ్ర



పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్.... పెనుబల్లి మండలంలో క్రిస్టమస్ పండుగ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య పలు చర్చ్ ల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. మండలంలోని క్రైస్తవ సోదరులకు మిఠాయిలు పంచి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, జడ్పిటిసి చిట్యాల మోహన్ రావు, కనగాల వెంకట్రావు, లక్కినేని వినీల్, పసుమర్తి వెంకటేశ్వరరావు, మండల భూక్యా ప్రసాద్, కనగాల సురేష్ బాబు, పండు తదితరులు పాల్గొన్నారు.

## వైరా గ్రేట్ విజన్ క్లబ్ అద్వర్యం లో లాప్టాప్ వితరణ




వైరాసూర్యమేజర్ న్యూస్: గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు ఉంద్రు వరలక్ష్మి గారి అద్వర్యం లో బిటెక్ చదువుతున్న వైరా కు చెందిన సూరోజు అభిలాష్ కు వున్నత చదువు నిమిత్తం లాప్టాప్ అందించారు ఈ కార్యక్రమం లో పాస్ట్ డిస్టిక్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులకు లాప్టాప్ లే కాకుండా చదువు నిమిత్తం ఆర్థిక సహాయం లయన్స్ విద్యా ట్రస్ట్ ద్వారా అందించాము అని తెలిపారు. ఈ కార్యక్రమం లో జీయంటి కోఆర్డినేటర్ ఉంద్రు శ్యామ్ బాబు, ఆర్సీ లగడపాటి ప్రభాకరరావు, తోటకూర శ్రీకాంత్ ,గంగవరపు కిషన్ , డాక్టర్ రవిచంద్ర ,వుయ్యూరు రామకృష్ణ , కే గోపి , పాల్గొన్నారు

## వైరామండలములో పలు చర్చిలలో ప్రార్దనలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**వైరాసూర్యమేజర్ న్యూస్ః-**

వైరామండలములో మధ్యాహ్నం 1:00 గంటలకు ముసలిమడుగు,2:00 గంటలకు లింగన్నపాలెం గ్రామంలో చర్చిల యందు వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోతు రామదాసు నాయక్ క్రిస్టమస్ సందర్భంగా కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేసి జీసస్ కృపమనందరిపైవుండాలని క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బొర్రా రాజశేఖర్ శీలం వెంకట నర్సిరెడ్డి దొడ్డ పుల్లయ్య. చప్పిడి వెంకటేశ్వర్లు. పాలేటి నరసింహారావు. పల్లపు కొండలు. స్థానిక నాయకులు నర్వనేని గోపాలరావు నర్వనేని బుజ్జి చింతనప్ప శ్రీనివాసరావు నాగార్జున తోటకూర జగ్గయ్య ధూళిపాళ్ల కిషోర్ చేంగల పరుశురాం శీలం సురేంద్ర రెడ్డి, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు

– 'రైట్ చాయిస్' ఆత్మీయ అభినందన సభ పోస్టర్ ఆవిష్కరణ





**ఖమ్మం:సూర్య మేజర్ న్యూస్**

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయంలో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి కేక్ కట్ చేసి.. అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. జనవరి మొదటి వారంలో రైట్ చాయిస్ అకాడమీ చైర్మన్ మెండెం కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే మంత్రి పొంగులేటి ఆత్మీయ అభినందన సభ పోస్టర్ ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుమలాయపాలెం ఎంపీపీ బోడ మంగీలాల్, నాయకులు కొడాలి గోవింద రావు, అజ్మీర అశోక్ నాయక్, జాన్ రెడ్డి, నరేందర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో మంత్రి పొంగులేటి పర్యటన



**ఖమ్మం సూర్య బ్యూరో:**

తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో మంగళవారం పర్యటించనున్నారు. ఈ మేరకు పర్యటన వివరాలను మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా ఉదయం 10గంటలకు ఉమ్మడి ఖమ్మంజిల్లా ఇన్ చార్జ్ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డితో పాటు వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజాపాలన పై సమీక్ష, విలేకరుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 4గంటలకు వరంగల్ జిల్లా ఇన్ చార్జ్ మంత్రిగా మంత్రులు కొండా సురేఖ, సీతక్కలతో కలిసి వరంగల్ జిల్లా హన్మకొండలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రజాపాలన పై సమీక్ష, విలేకరుల సమావేశంలో పాల్గొంటారు.

## నగరంలో మంత్రి తుమ్మల పర్యటన

**ఖమ్మం (సూర్య బ్యూరో)**





రోటరీ నగర్ లోని రాజరాజేశ్వరీ దేవాలయంలో మరియు ఎన్.ఎస్. టి క్యాంపు లోని శ్రీ సీతారామ స్వామి దేవాలయానికి రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెళ్లడంతో మంగళ వాయిద్యాలతో అర్చకులు వేద వచనాలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 10వ డివిజన్ కార్పొరేటర్ చావా మాధవి నారాయణ రావు ఆహ్వానం మేరకు వారి ఇంటికి వెళ్లడం జరిగినది. కార్యక్రమంలో సాదు రమేష్ రెడ్డి, తుంపాల కృష్ణమోహన్, మిక్కిలినేని మంజుల నరేంద్ర కామర్తపు మురళి, చావా నారాయణరావు, షేక్ జాన్బీ నాగుల్ మీరా, రావూరి సైదుబాబు,పోట్ల వీరేంద్ర,ఖాదర్ బాబా,బాణాల లక్ష్మణ్,పాషా, దుంపల రవి తో పాటు ఆ డివిజన్ లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా పట్టణ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఇసంపల్లి గ్రామంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించిన

-ఇమ్మానుయేలు ప్రార్థన మందిరం సంఘ కాపరి,సంఘ సభ్యులు

-క్రీస్తు జన్మదినం సందర్భంగా మందిరంలో కేక్ కట్ చేసిన

-డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామ్ చందర్ నాయక్







**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్**

డోర్నకల్ నియోజకవర్గం ఇసంపల్లి గ్రామం లో ఇమ్మానియేల్ ప్రార్థన మందిరంలో స్థానిక సంఘ కాపరి వడ్లమూడి డేవిడ్ రాజ్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని చర్చిలలో జరిగిన క్రీస్తు జన్మదిన వేడుకల్లో డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ పాల్గొని క్రైస్తవ సోదరసోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.మందిరంలో విద్యుత్ దీపాలతో అలంకరించారు. అనంతరం మందిర ఆవరణలో క్రీస్తు జన్మదిన వేడుక కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుల పాపము కొరకు మనిషిగా 33,1/2 సంవత్సరాలు జీవించి మరణించిన ఏసుక్రీస్తుని ప్రతి ఒక్కరు కొనియాడాలని వెల్లడించారు.క్రీస్తు జన్మదిన వేడుకల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని ఎమ్మెల్యే వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏసు బోధనలే ప్రపంచ మానవాళికి మార్గదర్శకాలు..ఏజీ సీఎం ఫాస్టర్ ఎం.ఏలియా

**సింగరేణి సూర్య మేజర్ న్యూస్**

సింగరేణి (కారేపల్లి డిసెంబర్ 25)ప్రపంచ మానవాళికి ఏసు సందేశాలే మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయని ఏజీ సీఎం ఫాస్టర్ ఎం.ఏలియా అన్నారు. మండల పరిధిలోని మాదారంలోని ఏజీ సీఎం చర్చిలో సోమవారం ఏసుక్రీస్తు పుట్టినరోజు అయిన క్రిస్టమస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించడంతోపాటు, కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు.నిరుపేద కుటుంబాలకు దుస్తులను అందజేశారు.ఈ సందర్భంగా ఫాస్టర్ ఎం.ఏలియా మాట్లాడుతూ.. బాల్యంనుండే ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొన్న ఏసు క్రీస్తు సమాజంలో అణగద్రొక్కబడినవారిని అక్కున చేర్చుకున్నారన్నారు.యేసు కరుణామయుడుగా మారి తన కరుణా కటాక్షాలతో ఈ ప్రపంచానికి కాంతిని ప్రసరించడానికి తన రక్తాన్ని శిలువ పై నవ్వుతూ చిందించిన మహోన్నత మానవతా మూర్తి అన్నారు.అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని మాదారం గ్రామ సర్పంచ్ అజ్మీర్ నరేష్ నాయక్ ప్రారంభించారు. ఈ



కార్యక్రమంలోస్థానిక సంఘ కాపరి పాస్టర్ జాన్ వెలిస్లీ, పాస్టర్ సత్యపాల్, పాస్టర్ సైమన్, పాస్టర్ థామస్, పాస్టర్ ఐజాక్, బెన్నీ, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి గ్రామంలో ఘనంగా కిస్మస్ వేడుకలు..

-క్రిస్టియన్ సోదరులకు దుస్తుల పంపిణి...



**సింగరేణి సూర్య మేజర్ న్యూస్**

సింగరేణి(కారేపల్లి డిసెంబర్ 25)లో సోమవారం కిస్మస్ వేడుకలను క్రిస్టియన్ సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. చర్చిలలో ఆదివారం రాత్రి ఆల్ నైట్ ప్రార్ధనలు నిర్వహించి సోమవారం ఇండ్లలో పండుగ సంబురాలను జరిపారు. చర్చీలలో జరిగిన ప్రార్ధనలకు వివిధ పార్టీల నాయకులు హాజరై క్రిస్టియన్ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాశ్, ఎస్సీసెల్ అధ్యక్షులు మేదరి వీరప్రతాఫ్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర, నాయకులు తలారి దేవప్రకాశ్లు చర్చిలకు వెళ్ళి క్రిస్టియన్ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ సెల్ అధ్యక్షులు మేదరి వీరప్రతాఫ్ ఇంట్లో వివిధ పక్షాల నాయకులు మీడియా సోదరులకు విందును ఏర్పాటు చేసి శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్టియన్ సోదరులకు గౌసుద్దీన్ దుస్తుల పంపిణి క్రిస్టియన్ పేద లకు ముస్లిం నాయకుడు ఎస్కె.గౌసుద్దీన్ దస్తులు పంపిణి చేసి మతసామరస్యాన్ని చాటుకున్నారు.100 మంది నిరుపేద క్రిస్టియన్లకు గౌసుద్దీన్ దుస్తులను అందజేశారు.

సూర్య

మంగళవారం 26 డిసెంబర్ 2023

# ఖమ్మం మాల మహానాడు ఆధ్వర్యంలో మనుస్మృతి దహనం కార్యక్రమం





**ఖమ్మం టౌన్ సూర్య మేజర్ న్యూస్**

డిసెంబర్ 25 ఖమ్మం నగరం 1927 డిసెంబర్ 25 న మనస్మృతిని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ తగలబెట్టిన ఈరోజు సరిగ్గా 96 సంవత్సరాల క్రితం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అంటరాని తనం యొక్క మతపరమైన ప్రాతిపదికన తిరస్కరణకు గుర్తుగా మనస్మృతి నీ తగలబెట్టారు మహద్ సత్యాగ్రహం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు మహద్ సత్యాగ్రహం అనేది అంటరాని వారి ప్రజానీతిని పొందే హక్కును మానవత్వం గౌరవాన్ని స్వీకరించడానికి జరిగిన పోరాటం స్త్రీ హక్కులు విముక్తి కోసం మను స్మృతి ని బహిరంగంగా తగలబెట్టడం ఒక రాజకీయ చర్య ఎందుకు అంటే ఈ పుస్తకం కేవలం మహిళల పట్ల కాకుండా అంటరాని వారి పట్ల అశేష పేద ప్రజల పట్ల అమానవీయమైన ప్రవర్తనలను బోధించే నియమాలను కలిగిన ఈ మనస్మృతిని తగలబెట్టడం జరిగింది ఇట్టి కార్యక్రమం ప్రతి ఏటా ఖమ్మం జిల్లాలో అంబేద్కర్ సెంటర్ లో జరుగుతుంది మాల మహానాడు జాతీయ నాయకులు గుంతేటి వీరభద్రం, ముప్పవరపు మంగయ్య, ఆర్టీసీ జాన్ పుల్లయ్య, గాదర బాబురావు, తెలంగాణ శ్రీనివాస్, నాగటి గోపాల్, తెలగమల్ల శ్రీను, కొప్పుల రామారావు, ఎర్ర గంగాధర్, కరాటే వేణు, చింతమల్ల వెంకటేశ్వర్లు, రోడ్డ శివయ్య, బి.కోటేశ్వరరావు తదితర మాల సోదరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సాగర్ జలాలు విడుదల చేయాలి

## -తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



**వైరాసూర్యమేజర్ న్యూస్ః-**

ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టు పరిధిలో ప్రస్తుతం సాగు లో ఉన్న పంటలకు సాగునీరు విడుదల చేయాలని, రబీ సీజన్లో ఆరుతడి పంటల సాగుకు ప్రభుత్వం అవకాశం కల్పించాలి అని ,తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు.సోమవారం వైరా సిపిఎం కార్యాలయం బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్ లో ఎస్ కె జమాల్ అధ్యక్షతన జరిగిన సుందరయ్య నగర్ శాఖ సభ్యులు సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ళు, పంట కోత దశలో మిచౌంగ్ తుఫాన్ కారణంగా రైతులు దారుణం గా నష్టపోయిన పరిస్థితుల్లో రెండోవ పంట ఆరు తడి పంటలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, ప్రస్తుతం జిల్లా లో వేలాది ఎకరాల విస్తీర్ణంలో సాగు లో ఉన్న పంటలకు నవంబర్ 25 నుంచి సాగర్ జలాలు విడుదల కాలేదు అని, డిసెంబర్ మొదటి వారంలో వచ్చిన మిచౌంగ్ తుఫాన్ వల్ల వాగులు వంకలు చెక్ డ్యాం లు, కుంటలు చెరువులు బావులు లో నీరు చేరి పంటలకు ఇరవై రోజుల నుంచి ఇబ్బందులు లేకుండా ఉందని సాగర్ జలాలు ఆఫ్ అన్ పద్ధతి లో విడుదల చేస్తే మినుములు పెసలు, మొక్కజొన్న లాంటి పంటలు పాలేరు, వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో చెరకు,వరి పంటలు సాగు కి అవకాశాలు కల్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు మల్లెంపాటి వీరభద్రం, మాజీ ఎంపిపి బొంతు సమత , మందడపు రామారావు, కురుగుంట్ల శ్రీనివాసరావు,నారికొండ అమరేంద్ర, శీలం నారాయణ రెడ్డి, ఎస్ కె పాషా, మల్లెంపాటి ప్రసాద్, వడ్లమూడి మధు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం అంబేద్కర్ సెంటర్ మనుస్మృతి దహన కార్యక్రమం

## -యూనిటీ ఆఫ్ మాల ఖమ్మం జిల్లా కమిటీ



**ఖమ్మం టౌన్ సూర్య మేజర్ న్యూస్**

డిసెంబర్ 25 ఖమ్మం నగరం బిఆర్.అంబేద్కర్ సెంటర్ లో యూనిటీ ఆఫ్ మాల ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కందుల ఉపేందర్ అధ్యక్షతన మనుస్మృతి కాల్చివేసే కార్యక్రమము జరిగింది. ఈ కార్యక్రమంలో యూనిటీ ఆఫ్ మాల స్టీరింగ్ కమిటీ సభ్యులు గులగట్టు ఎల్లయ్య మాట్లాడుతూ మహారాష్ట్రలోని మహాద్ చౌదరి చెరువులో ఒక అంటరాని దళితుడు ఆ చెరువులో నీరు త్రాగాడని అక్కడి ఆదిపత్య కులాలు ఆ దళితునిపై నిరంకుశత్వంతో పెట్టిన హింసలకు వ్యతిరేకంగా ఆనాడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పదివేల మందితో ఆ చెరువులో నీరు త్రాపించి అనంతరం మనుస్మృతిని తగలబెట్టినారు అని ఈ సందర్భంగా మాట్లాడినారు యూనిటీ ఆఫ్ మాల జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి కనకరాజు మాట్లాడుతూ రంగు ప్రాతిపదికన ఆనాటి ఆధిపత్య కులాలు శ్రమ దోపిడీ చేస్తూ సమాజికంగా మనుస్మృతి రాజ్యాంగం ప్రకారం నిమ్న జాతులను విద్యకు అన్ని రంగాలకు దూరంగా బానిసలుగా ఉన్నటువంటి తరుణంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మనుస్మృతి ని తగలబెట్టి నిమ్న జాతుల హక్కుల కోసం నిరంతరం పోరాడినటువంటి మహానేత అని అన్నారు ఈ జాతులను సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చేయుటకు రాజ్యాధికారంలో రావడం కోసం అహర్నిశలు శ్రమచేసి కృషిచేసి భారత రాజ్యాంగానికి అధ్యక్షుడు అయి భారత రాజ్యాంగంలో సర్వహక్కులు కల్పించినటువంటి మహానేత అని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సేవలు కొనియాడారు. దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు రొడ్డ శివయ్య మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను నిరంతరం కొనసాగించాలని తన సిద్ధాంతాలకు అనుగుణంగా ఉద్యమాలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో యూనిట్ ఆఫ్ మాల జిల్లా నాయకులు నల్లపు రమేష్, చింతమల్ల సుందర్రావు, చిలకబత్తిని కనకయ్య తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా యువ నాయకుడి జన్మదిన వేడుక



**ఏన్కూర్ సూర్య మేజర్ న్యూస్:**

మండల సీనియర్ నాయకులు సొసైటీ అధ్యక్షులు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు తనయుడు యువ నాయకుడు శెట్టిపల్లి నరేష్ జన్మదిన వేడుకను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. హాస్పటల్ కు సిరంజీలు అందజేశారు. అనంతరం కొత్త మేడేపల్లి గిరిజన చిన్నారులకు పరీక్ష ఫ్యాడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శెట్టిపల్లి నరేష్ దంపతులతో పాటు ఆది నరసింహారావు, మజీద్ ఖాన్, సయ్యద్ సుభాని, సయ్యద్ హుస్సేన్,కూరాకుల రమేష్, ఈవూరి సైదులు, నారాయణ దాస్, నరసింహారావు, బండారు అప్పారావు, భూపతి వెంకీ, కూసినిరోశయ్య, ఉమ్మినేని శేఖర్, పెద్దబాబు తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్ట్ మస్ పండుగ సందర్భంగా చర్చిలో తుమ్మల ప్రత్యేక ప్రార్థనలు



**ఖమ్మం (సూర్య బ్యూరో)**

క్రిస్మస్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఖమ్మం పట్టణ వైరా రోడ్ లోని ఆర్.సి.ఎం. చర్చిలో ఈరోజు రాత్రి ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఆర్. సి.ఎంచర్చ్ ఫాదర్ జి .సురేష్ కుమార్, ఫాదర్ బాలజోజి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తుమ్మల ను ఆశీర్వదించారు. అనంతరం ప్రార్థన కార్యక్రమంలో తుమ్మల మాట్లాడుతూ ఏసుప్రభు దయ వల్ల రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో అన్నదమ్ముల కలిసి ఆనందంగా ఉండాలని కోరుకుంటూ అందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు సాదు రమేష్ రెడ్డి, చోటే బాబా, కామర్తపు మురళి ,తుపాకుల యలగొండ స్వామి, పకలాపాటి విజయ లక్ష్మి, వీరభద్రం, మిక్కిలినేని నరేందర్,రషీద్, శేషగిరి,పొట్ల వీరేంద్ర, జంగం భాస్కర్, కృష్ణ ప్రసాద్, వెంకన్న, రామకృష్ణ, రాజేందర్ లక్ష్మణ్, రవి, తదితర జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# క్యాంపు కార్యాలయంలో పూజలు నిర్వహించిన మంత్రి తుమ్మల





**ఖమ్మం (సూర్య బ్యూరో)**

మొదటిసారిగా వీడియోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయానికి వచ్చిన సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మార్కెటింగ్ చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనం తరం ప్రజల సందర్శనార్థం అందుబాటులో ఉండడంతో జిల్లా నలు మూలల నుండి వచ్చిన అధికారులు, వివిధ సంఘాల నాయకులు, జిల్లా కాంగ్రెస్ పట్టణ కాంగ్రెస్ నాయకులతోపాటు ఎంపీపీలు, జడ్పిటిసిలు, కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డ్ మెంబర్లు, తోపాటు తుమ్మల అభిమానులు భారీ సంఖ్యలో వచ్చి తుమ్మల కి శుభాకాంక్షలు తెలిపినారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయం సందడిగా మారింది. అనంతరం తుమ్మల గారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాయకత్వం లో సోనియాగాంధీ ఆశీస్సులతో సుపరిపాలన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందిఎన్నికల్లో చెప్పిన వాగ్దానాలు అమలు చేస్తాం.ప్రశాంతమైన ప్రగతిశీల ఖమ్మం అభివృద్ధి చేస్తాం. ఖమ్మం నియోజకవర్గం లో నన్ను గెలిపించిన ప్రజలకు నమస్కరిస్తూన్నా అని అన్నారు.

# చెరుకు ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

## తండ్రిని కోల్పోయిన చిన్నారులు

**పెనుబల్లి సూర్య( మేజర్ న్యూస్)**

నిబంధనలకు విరుద్ధంగా అధిక చెరుకు లోడుతో ప్రయాణిస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ నిండు ప్రాణాని బలి తీసుకుంది. ఇద్దరు చిన్నారులకు తండ్రి లేని వారిని చేసింది. కుటుంబ ఆసరాను కోల్పోయి ఇద్దరు పిల్లలను తండ్రి లేని వాడిని చేసిన హృదయవిదాయక ఘటన కరాలపాడుగ్రామంలో చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి కల్లూరు మండలం కొత్త నారాయణపురంలో చెరుకులోడుతో వెళుతున్న ట్రాక్టర్ బైక్ ని ఢీ కొట్టడంతో పెనుబల్లి మండలం కరాలపాడు గ్రామానికి చెందిన వేముల రామారావు(35) మృత్యువాత చెందాడు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న మృతుడు



రామారావు క్రిస్టమస్ సెలవులకు స్వగ్రామం కరాలపాడుకు వచ్చాడు. ఆదివారం కల్లూరులోని బంధువులు ఇంటికి వెళ్లి తిరుగు ప్రయాణంలో కరాలపాడు వెళుతున్న క్రమంలో కొత్త నారాయణపురం రోడ్డులో చెరుకు లోడుతో వెళుతున్న ట్రాక్టర్ బైక్ ని ఢీ కొట్టడంతో మరణించారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, బాబు, పాప ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించాడన్న వార్త విన్న కుటుంబ సభ్యులు రోదనలు స్థానికులను కలచి వేసింది. కారాలుపాడు గ్రామంలో విషాద ఛాయలనుకున్నాయి. రామారావు మృతదేహాన్ని పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ప్రమాదంపై పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# దయాకర్రెడ్డిని మర్యాదపూర్వక కలిసిన ముస్లిం మత పెద్దలు

**ఖమ్మం రూరల్ సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని ఏదులాపురం గ్రామపంచాయతీకి చెందిన ముస్లిం మత పెద్దలు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చాలను అందజేసి ,శాలువతో ఆయనను సత్కరించారు. తమ గ్రామంలోని సమస్యలు, అభివృద్ధి పనులను గురించి మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పాలేరు అసెంబ్లీ కాంగ్రెస్ యూత్ వైస్ ప్రెసిడెంట్ భూక్య సురేష్ నాయక్, కాంగ్రెస్ నాయకులు కళ్లెం శేషి రెడ్డి, ముస్లిం మత పెద్దలు ఆరిఫ్, సాహెబ్ , మస్తాన్ , పఠాన్, యువ ముస్లిం సభ్యులు అమన్, లాల్ సాహెబ్, మన్సూర్ అలీ, యూసఫ్, జావిద్ ,యాసిన్ తదితరులు పాల్గొన్నారు.



# కుప్పెనకుంట్ల దేవాలయాల్లో చోరీ



పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్..వరసగా మూడు దేవాలయాల్లో గుర్తు దుండగులు చోరికి పాల్పడ్డ ఘటన మండలంలో చోటుచేసుకుంది. పెనుబల్లి మండలం కుప్పెనకుంట్ల గ్రామంలోని శివాలయం, రంగనాదుని స్వామి, అంజనేయులు స్వామి వేరు వేరు ప్రదేశాల్లోని దేవాలయాలలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు హుండిలను పగలుకొట్టి సుమారు రూ.15వేలు భక్తులు సమర్పించిన కానుకలు చోరికి పాల్పడ్డారని ఏఎస్ఐ సత్యనారాయణ తెలియజేశారు. గ్రామస్థుల సమాచారంతో ఏఎస్ఐ సత్యనారాయణ, కానిస్టేబుల్ జి. శ్రీనివాసరావు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి విచారణ చేపట్టారు.

# క్రిస్టమస్ కేక్, స్వీట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మట్ట



**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్...**కరుణామయుడు లోక రక్షకుడు ఏసుప్రభువు పుట్టినరోజు క్రిస్టమస్ పండుగ సందర్భంగా పెనుబల్లి మండలంలోని పలు చర్చ్ లలో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ క్రైస్తవ సోదరులకు క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలుపుతూ చర్చ్ ల్లో కేకు, స్వీట్స్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మర్లకుంట గ్రామంలో ఎమ్మెల్యే రాగమయి పంపించిన స్వీట్ బాక్స్ లను గ్రామ కాంగ్రెస్ నాయకులు క్రైస్తవ సోదరులకు అందించారు. ఈ కార్యక్రమంలో కొప్పుల రామరాజు,నారాయణ, కొప్పుల కాళిదాసు, మురళి, శ్రీను, వేముల కృష్ణయ్య, మేడరాజు, ఉదయ్ కుమార్, మొగిలిచర్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# కర్మేల్ ప్రేయర్ టవర్ చర్చిలో "ఘనంగా" క్రిస్మస్ వేడుకలు

**ఖమ్మం రూరల్ సూర్య మేజర్ న్యూస్**



ఖమ్మం రూరల్ మండలంలోని పల్లెగూడెం గ్రామంలో గల కర్మేల్ ప్రేయర్ టవర్ చర్చి నందు క్రిస్మస్ వేడుకలను సోమవారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. దీనికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయం ఇన్చార్జ్ తుంబురు దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఏర్పాటు చేసిన కేకును కట్ చేశారు. అనంతరం విశ్వాసులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు, యేసయ్య గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ పాలేరు నియోజకవర్గ నాయకులు లింగా వెంకటనారాయణ , సర్పంచ్ కళ్లెం ముత్తయ్య , ఎంపీటీసీ కొమరబత్తిని అన్నమ్మ, కాంగ్రెస్ నాయకులు మద్ది వీరారెడ్డి లింగా పెద్ద శీనయ్య, పాస్టర్ పీటర్ తడగొండ, తదితరులు పాల్గొన్నారు.



# లక్ష్మీపురం గ్రామం ఇమ్మానియేల్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు





**ముదిగొండ సూర్య మేజర్ న్యూస్ :-**ముదిగొండ మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో గల ఇమ్మానియేల్ చర్చి నందు క్రిస్మస్ వేడుకలను సోమవారం నాడు ఘనంగా నిర్వహించారు. దీనికి కాంగ్రెస్ మండల నాయకులు దేవరపల్లి అనంతరెడ్డి,మహమ్మద్ అజ్గర్, ఎస్డి రఫీ,ఎంపీపీ సామినేని హరిప్రసాద్, లక్ష్మీపురం సర్పంచి వాకధాని కన్నయ్య, ముదిగొండ మండలం ఎస్సై గజ్జల నరేష్ ముఖ్య అతిథిగా హాజరై ఏర్పాటు చేసిన కేకును కట్ చేశారు.అనంతరం విశ్వాసులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు, యేసయ్య గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో దేవరపల్లి అనంతరెడ్డి,మహమ్మద్ అజ్గర్, ఎస్డి రఫీ,ఎంపీపీ సామినేని హరిప్రసాద్, లక్ష్మీపురం సర్పంచి వాకధాని కన్నయ్య, కొమ్ము ఉపేందర్ రాంప్రసాద్ తోటమల్ల ఉదయ్.సైదులు గౌడ్. ఎస్డి రఫీ, రాజు, వీరయ్య, బసవయ్య, లక్ష్మీపురం గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ సందర్భంగా వాలీబాల్ పోటీలు.



ఎర్రుపాలెం సూర్య మేజర్ న్యూస్:-మండల పరిధిలోని బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల లో సోమవారం క్రిస్మస్ పండగ సందర్భంగా వాలీబాల్ పోటీలు సీనియర్ పీఈటీలు గూడూరు సత్యనారాయణరెడ్డి,కె. రాజశేఖర్, కొత్తపల్లి రాము, కృష్ణ ప్రసాద్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు నంద్రు సుధాకర్, ఆర్గనైజ్ కమిటీ కోన సాయి కార్తీక్, వేమిరెడ్డి శివ నాగిరెడ్డి, శీలం బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాలీబాల్ పోటీలో హెూరాహెూరీగా జరిగాయి. ఈ పోటీల్లో పది టీములు పాల్గొన్నట్టు కమిటీ వారు తెలియజేశారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి కొత్తపల్లి ఆకాష్ టీమ్, ద్వితీయ బహుమతి సంతోష్ టీమ్, తృతీయ బహుమతి వికాస్ టీమ్ గెలుపొందాయి. ఈ బహుమతులను దాతల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్, భరత్, శ్రీహరి, నరసింహారెడ్డి సాయి, గణేష్, మణికంఠ, నారాయణరెడ్డి, అఖిల్,ఫణి తదితరులు పాల్గొన్నారు



# కార్మికుల సమస్యలకోసం కృషి చేస్తున్న ఏఐటియూసిని గెలిపించండి

**-ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు**






కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్ న్యూస్ )- కార్మికులతో మమేకమై ఎల్లవేళలా కార్మికులకు అండగా ఉంటూ వారి సమస్యలకోసం కృషి చేస్తున్న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి), నక్షత్రం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని యూనియన్ గౌరవ అద్యక్షులు, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివ రావు సింగరేణి కార్మికులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం జి.కె.ఓ.సి, పివికే 5, వి.కె. వర్క్ షాప్, జి.ఏం. ఆఫీసు, హెడ్ ఆఫీసు, మెయిన్ హాస్పిటల్, సెంట్రల్ వర్క్ షాప్, మెయిన్ వర్క్ షాప్ లలో జరిగిన సమావేశాలలో అయన మాట్లాడుతూ సింగరేణి లో పేరుకు పోయిన సమస్యల పరిస్కారం సర్కారు సంఘాలతో సాధ్యం కాదని అవి కేవలం ఏఐటి యూసి తో నే సాధ్యమని ఆయన తెలిపారు. సింగరేణి కార్మికులకు స్వంత ఇంటి పథకం కొరకు అసెంబ్లి లో లేవనెత్తి సమస్య పరిస్కారం కొరకు పాటు పడుతానని, అనిసెట్టిపల్లి, వి.కె.7 ఓ.సి మరియు రాంపుర్ షాఫ్ట్ బ్లాక్ లను ఏర్పాటు చేయుటకు కృషి చేస్తానని హామీనిచ్చారు . సింగరేణి లో రాజకీయ జోక్యం లేకుండా ఉండే కార్మిక సంఘమైన ఏఐటిరయూసి ని గెలిపించాలని కార్మికులు నిర్ణయానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. గతంలో సింగరేణి లో బోనస్, పెన్షన్ తో పాటు ఎన్నో హక్కులను, చట్టాలను తెచ్చి సమస్యలను పరిస్కరించిన ఏఐటి యూసి కి కార్మికులు అండగా నిలవాలని ఆయన కోరారు. ప్రైవేటీకరణకు, కాంట్రాక్టక్తీకరణకు వ్యతిరేకంగా ఏఐటి యూసి అనేక పోరాటాలు చేసిందని కావున కార్మికుల పక్షాన పోరాడే ఏఐటినయూసి కె ఓటు వేయాలని, రాజకీయ పార్టీలకు తొత్తులుగా ఉండే టిబిజికేఎస్, ఐఎన్ టి యు సి సంఘాలకి ఓటు వేస్తే కార్మికుల హక్కులు ఆగమై పోతాయని కావున కార్మికులు ఆలోచించి ఏఐటి యూసి కి ఓటు వేసి గెలిపించ్లని ఆయన కోరారు. ఈ సమావేశాలలో యూనియన్ నాయకులు డి. శేషయ్య, రమణ మూర్తి, వంగ వెంకట్, భాగ్యలక్ష్మి, నర్సయ్య, సుబ్బారావు, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## "సత్యం"స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బిర్యానీ ఆహార పొట్లాలను పంపిణీ



కొత్తగూడెంటౌన్,సూర్య (మేజర్ న్యూస్)- కొత్తగూడెంలోని బస్ స్టాండ్ ప్రాంగణంలో"సత్యం"స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పొన్నెకంటి సంజీవరాజు ఆధ్వర్యంలో సోమవారం బిర్యానీ ఆహార పొట్లాలను పంపిణీ చేయడం జరిగినది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వారు మాట్లాడుతూ క్రిస్టమస్ పండుగ సందర్భంగా సత్యం స్వచ్ఛంద సంస్థ ద్వారా బీదలకు,భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి ఒక పూట భోజనం పెట్టాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగినదని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సమత, ఉపాధ్యక్షులు పొన్నెకంటి వర్షిత, కోశాధికారి పొన్నెకంటి జయకుమారి, బొడ్డు వేణు, తదితరులు పాల్గొన్నారు.

## ఐక్య తల్లిదండ్రుల సంఘం మండల కమిటీ నియామకం..

**- ప్లాస్టిక్ ను నిర్మూలిద్దాం..**

**-జిల్లా సెలక్షన్ బోర్డ్ చైర్మన్ చిప్ప రాంప్రసాద్.**




**అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్)** – మండల కేంద్రంలో సోమవారం ఐక్య తల్లిదండ్రుల సంఘం జిల్లా సెలక్షన్ బోర్డు చైర్మన్ చిప్పా రాంప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రత్నాకర్ సమక్షంలో ప్రత్యేకమైన సమావేశం నిర్వహించి మండల కమిటీని నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ప్రతిరోజు సమస్యలు పెరుగుతున్నాయని, నిరక్షరాసులు సమస్యలు పరిష్కరించుకోవడంలో చాలా ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారి కోసమే ఐక్య తల్లిదండ్రుల సంఘం ఏర్పడిందని తెలిపారు. ఈ సంఘం ఎటువంటి ఆర్థిక లావాదేవీలు ఉండవని, నిరుపేదలకు సహాయం, రోగులకు అత్యవసర పరిస్థితుల్లో రక్తం సరఫరా, వికలాంగులకు సదరన్క్యాంప్లో అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయడం తదితర 42 విభాగాల్లో సమస్యలు పోరాటమేనని ఈ సంఘం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ సంఘం ప్లాస్టిక్ నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ అనుసరించాల్సిన విషయాలను ప్రజలకు అవగాహన కల్పిస్తుందని తెలిపారు. ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించాలని, గుడ్డ సంచులను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## మనుధర్మ శాస్త్రం బహుజనులను బానిసలుగా చేసింది

**– బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో మనుస్మృతి దహన దివస్.**



పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్) – భారతదేశంలో బహుజన కులాలను బానిసలుగా చేసిన మనుధర్మ శాస్త్రాన్ని దహనం చేసారు.సోమవారం పాల్వంచ జాతీయ రహదారి అంబేద్కర్ సెంటర్లో బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో మనుధర్మ శాస్త్ర ప్రతులను దహనం చేసారు.ఈ సందర్భంగా భారత రాజ్యాంగం వర్ధిల్లాలని, మనుధర్మ శాస్త్రం నశించాలని నినాదాలు చేసారు.వక్తలు మాట్లాడుతూ బహుజనులను అతి నీచంగా చూసిన మనుధర్మ శాస్త్రాన్ని 1927, డిసెంబర్ 25 వ తేదీన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పదివేల మంది కార్యకర్తల సమక్షంలో మనుధర్మ శాస్త్రం ప్రతులను దహనం చేసారని,దానికి గుర్తుగా నేడు పాల్వంచలో ప్రతులను దహనం చేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన ఐక్య వేదిక కన్వీనర్ బరగడి దేవదానం,తొలి,మలి తెలంగాణ ఉద్యమ కారుడు శ్రీపాద సత్యనారాయణ, జిల్లా బీ.సీ సంఘం నాయకులు చిటికిన ముసలయ్య, తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకుడు నబీసాహెబ్,టి యూ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంజూర్,సీ.పీ.యమ్.యల్ ప్రజాపంథా జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు,పాల్వంచ పట్టణ నాయకుడు రాం శ్రీను,గుర్రం వెంకటేశ్వర్లు,భాస్కర్,శనగ రామచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సాలి భాస్కర్ ఆధ్వర్యంలో పేదలకు సాయం



పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్) – సెమీ క్రిస్మస్ వేడుకలను న్యూ లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సెమీ క్రిస్మస్ ని పురస్కరించుకొని ఆదివారం పాల్వంచ పట్టణ పరిధి శ్రీనివాస్ కాలనీ లోని క్రీస్తు సంఘం చర్చిలో న్యూ లైఫ్ సొసైటీ చైర్మన్ సాలి భాస్కర్ పేదలు, వికలాంగులు, లెప్రసి రోగులకు నూతన దుస్తులు, 18 రకాల నిత్యవసర సరుకుల కిట్ అందజేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రతి ఏటా సాలి భాస్కర్ సెమీ క్రిస్మస్ సందర్భంగా పేదలను ఆదుకోవడం అభినందనీయమన్నారు. భాస్కర్ సేవలు మరింత విస్తృతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతాజీ యువజన సంఘం అధ్యకులు ఎస్.జె.కె. అహ్మద్, న్యాయవాది నరసింహ చారి, పాస్టర్లు వెంకటరత్నం, ప్రేమ దాసు, పరంజ్యోతి, క్రీస్తు సంఘం సభ్యులు జె. స్టాలిన్, జె. అబిషేక్, ఆర్కె, వేణు, వెంకటేష్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు



చర్ల, సూర్య (మేజర్న్యూస్)- మండలంలోని లక్ష్మీకాలనీ చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు చీమల మర్రి మురళీృష్ణ, దేవభక్తుని రామకృష్ణ(ఆర్కే),చర్ల ఉపసర్పంచ్ సీరిపురపు శివలక్ష్మినారాయణ, తోటమళ్ళ వరప్రసాద్ పాల్గొని క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మురళీకృష్ణ మాట్లాడుతూ క్రైస్తవ సోదరులు అందరూ సంతోషంతో క్రిస్మస్ పండుగ నిర్వహించుకోవాలని క్రీస్తు పుట్టిన రోజు వేడుకలను క్రైస్తవ సోదరులు అత్యంత ఘనంగా క్రిస్మస్ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు.తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఏసుక్రీస్తుకు ప్రార్థనలు చేయాలని క్రైస్తవులను కోరారు ఈసందర్భంగా కేక్ కట్ చేసి క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులకు చర్చ్ కమిటీ సన్మానం చేసారు.ఈ కార్యక్రమంలో చర్చ్ ఫాస్టర్ వాసం రాజు,పునెం ముకేష్, సొడి ముత్తయ్య, మడివి శేఖర్,వాసం రాజు, సోడి లక్ష్మి,వాసం అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

అశ్వారావుపేట, సూర్య (మేజర్న్యూస్)- లోకోద్ధారకుడైన ఏసుక్రీస్తు జన్మదినోత్సవం సందర్భంగా అశ్వారావుపేట మండలం వ్యాప్తంగా సోమవారం క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుండే పట్టణంలోని హెూసన్నా ప్రార్థనా మందిరం, హెూలీఫేత్ ఫెలోషిప్, సిఎస్ఐ చర్చి, యోహాను ప్రార్థనామందిరం, ఆర్సిఎం, సిఎస్ఐ చర్చి తదితర ప్రాంతాలలో గల ఆయా ప్రార్థనా మందిరాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు, గీతాలు ఆలపించారు. పట్టణంలోని పలు చర్చిలను శోభాయమానంగా విద్యుత్ దీపాళతో, రంగు కాగితాలతో అలంకరించారు. ఈ సందర్భంగా సందేశకులు క్రీస్తు జన్మదినోత్సవం యొక్క విశిష్టతను, క్రీస్తు ప్రేమ గురించి వివరించారు. అదే విధంగా మన దేశనాయకుల క్షేమము గూర్చి, దేశ రక్షణ గురించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు, ఫాస్టర్లు క్రిస్మస్ సందేశాన్ని, ఏసుక్రీస్తు జన్మదినోత్సవ వృత్తాంతాన్ని తెలియజేశారు. భక్తులు భక్తి శ్రద్దలతో ప్రార్థనలు, గీతాలు ఆలపించారు. క్రిస్మస్ కేక్ను కట్చేసి పండుగ శుభాకాంక్షలు తెలియపర్చుకున్నారు. పలు ప్రార్థనా మందిరాల వద్ద వివిధ వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.



# బొగ్గుగని కార్మికులకు హక్కులు సాధించిన ఘనత ఐఎఫ్‌టియూదే




**–జిఎల్ బికేఎస్ జనరల్ సెక్రటరీ సీతారామయ్య**

కొత్తగూడెంసింగరేణి, సూర్య (మేజర్‌న్యూస్) – విప్లవ కార్మిక సంఘాలు చేసిన ఎన్నో వీరోచిత పోరాటాలతో వేతన ఒప్పందాలు సాధించి అనేక హక్కులు సౌకర్యాలను సాదించు కొన్న సింగరేణి కార్మికులు దేశ వ్యాప్త బొగ్గుగని కార్మికులందరికీ ఆదర్శంగా నిలిచారని ఐఎఫ్‌టియూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.అనురాధ, జిఎల్ బికేఎస్ జనరల్ సెక్రటరీ జే.సీతారామ య్య అన్నారు. కొత్తగూడెం ఓసిపిలో కాపు కృష్ణ అధ్యక్షతన జరిగిన గేటు మీటింగులో వారు మాట్లాడుతూ సింగరేణిలో నేడు ఎన్నో వేతన ఒప్పందంలోని అంశాలు అమలు జరగడం లేదని పేర్కొ 2011నుంచి అధికారులకు అమలు చేస్తుంటే పట్టించుకోని జాతీయ సంఘాలు ఆదాయ పన్ను రద్దు చేస్తామని చెప్పడం మోసం తప్ప మరేమీ కాదన్నారు. ఈ నెల 27న జరగబోతున్న ఎన్నికలలో హక్కుల రక్షణకు,నూతన భూగర్భ గనులకు ఉద్యోగ భద్రతకు ఓటు వేయాలని భవిష్యత్ తరాలకు సింగరేణిని బతికించే,ఉద్యోగాలను నిలబెట్టే అవకాశాన్ని రక్షించేందుకు ఓటు వజ్రాయుధంగా చేసుకొని గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం(జి ఎల్ బి కే ఎస్ ) చక్రంలో సుత్తి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. విప్లవ కార్మిక సంఘాలు కార్మికవర్గ పక్షాన నిజాయితీగా పోరాడు తున్నాయని విప్లవ కార్మిక సంఘాల మద్దతుతో పోటీ చేస్తున్న గోదావరి కార్మిక సంఘం చక్రంలో సుత్తి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని సాదినేని కోరారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యూ జిల్లా అధ్యక్షులు ఎల్.విశ్వనాథం, సిడబ్ల్యుయూ రాష్ట్ర కోశాధికారి మల్లీ ఖర్జున్, పాల్గొన్నారు.

# సన్మార్గంలో నడిచేందుకు యేసు బోధనలు దోహదపడతాయి

**–ఆర్.సి.యం చర్చి క్రిస్మస్ వేడుకలు**

**– పాల్గొన్న కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు.**



పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్) – సన్మార్గంలో నడిచేందుకు యేసు బోధనలు దోహదపడతాయినీ కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం పాల్వంచలోనీ ఆర్.సి.యం చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ కేకను కట్ చేసి క్రైస్తవ బోధకులకు, సోదరీ, సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షమాగుణం, శాంతి, కరుణ, సహనం, ప్రేమతో జీవించిన క్రీస్తు జీవన గమనం నేటికీ అందరికి అచ్చునిరయాణమని అన్నారు. దాతృత్వం, త్యాగం ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహొన్నత సందేశాలని ఆయన పేర్కొన్నారు. తద్వారా, మానవాళిని సత్యపథం వైపు నడిపించేలా ఏసుక్రీస్తు మార్గనిర్దేశం చేశారన్నారు. దుర్మార్గం నుంచి సన్మార్గానికి, అమానుషత్వం నుంచి మానవత్వానికి, చెడు నుంచి మంచికి, దురాశ నుంచి దాతృత్వం, త్యాగాలకు జీసస్ బాటలు వేశారని కూనంనేని అన్నారు. పండగలు, వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్ రావు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు ఎర్రం శెట్టి ముత్తయ్య, సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, ఎండి పాషా, కాంగ్రెస్, టీడీపీ నాయకులు నవభారత కోటి, పైడిపల్లి దుర్గ మహేష్, కందకురి రాము, వీరమాచినేని నరేష్, చర్చ ఫాదర్లు తదితరులు పాల్గొన్నారు.

## మండల వ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్ వేడుకలు.





ఆళ్ళపల్లి, సూర్య (మేజర్‌న్యూస్) – క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లోని చర్చ్ లలో క్రైస్తవ సంఘస్తులు, విశ్వాసులు చర్చ్‌లు సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. క్రైస్తువులకు అత్యంత ముఖ్యమైనపండుగ ,క్రిస్మస్ కావడంతో మూడురోజుల ముందునుండే ప్రత్యేకత సంతరించుకుంది.ఈ వేడుకలనుకులమతాలకతీతంగా అందరూ ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ మేరకుఆర్ సిఎం, సిఎస్ఐ, కృపా మందిరం హెబ్రోను, పలు పెంతుకోస్తు చర్చిలలో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగిందని విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ కూరపాటి యాకోబు, సిఎస్ఐ పాస్టర్ రెవరెండ్ గుజ్జర్లపుడి ఏసుపాదం దేవమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఎస్ సిస్టర్స్ మేరీ శాంతాల్, దామరిస్, స్వర్ణ, జ్యోతిర్మయ్ యానిమేటర్ ప్రభాకర్, సెక్రెటరీ కన్నయ్య, సంఘ నాయకులు సుధాకర్, చిరంజీవి, స్వామిదాస్, బాబు, ముకుందరావు, దాసు, సునీత, మమత, సుజాత, విజ్జమ్మ, చిట్టెమ్మ మణెమ్మ కౌసల్య బాయమ్మ, ప్రమీల, ద్వారక, సులోచన, లలిత, రుక్మిణి, జయమ్మ, రాజీ, మంగా, తదితరులు పాల్గొన్నారు.

## కోడి పందాల స్థావరాలపై ఎస్సై రవికుమార్ ఉక్కు పాదం..

**–పోలీసులు అదుపులో ఐదుగురు నిందితులు..**

దమ్మపేట,సూర్య (మేజర్ న్యూస్) – మండల పరిధిలోని తొట్టి పంపు గ్రామ శివారులో కోడిపందాలు వేస్తున్నారని నమ్మదగిన సమాచారంతో స్థానిక ఎస్సై రవికుమార్ కోడిపందాలు వేస్తున్న స్థలానికి చేరుకొని కోడిపందాలు ఆడుతున్న ఐదురుగు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.స్థానిక ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఆరు ద్విచక్ర వాహనాలను, రెండు కోడిపుంజులను, రూ 5,150 లు నగదును స్వాధీన పరుచుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో ఆయనతోపాటు స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బొలెరో వాహనం కిందపడి రైతు మృతి

పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్)– పట్టణ పరిధిలోని ద్వారక రైస్ మిల్లు వద్ద కేటీపీఎస్ లో ఆర్టిజన్ కార్మికునిగా పనిచేస్తున్న లింగయ్య అనే రైతు బొలెరో వాహనం కిందపడి చనిపోయాడు. క్రిస్టమస్ పండగ పూట దూదిమెట్ల లింగయ్య తన పొలంలో పండిన వడ్ల బస్తాలను పాల్వంచ కేఎస్పీ రోడ్ లో ఉన్న ద్వారక రైస్ మిల్లులో దించేందుకు వాహనంతో ధాన్యాన్ని తీసుకువచ్చాడు. వాహనం రివర్స్ చేస్తుండగా దానికిందనే పడి అక్కడికక్కడే మృతి చెందాడు.

## చర్చిల్లో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న డిసిఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల



పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్)– క్రిస్మస్ సందర్భంగా సోమవారం పలు చర్చిల్లో జరిగిన ప్రార్థనల్లో డిసిఎంఎస్ వైస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. పాత పాల్వంచలో సెయింట్ మేరీస్ చర్చిలో పాస్టర్ అనిల్ కుమార్ బాబు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల పాస్టర్ అనిల్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, చర్చి కమిటీ సభ్యులు వెంకటరత్నం, ప్రభాకర్ రావు, సోమయ్య, చిట్టిబాబు, కాంతారావు, కాంగ్రెస్ నాయకులు కందుకూరి రాము, పులి సత్యనారాయణ, పైడిపల్లి మహేష్, బండి అంబేద్కర్, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశానికై శిక్షణ

పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్)– ప్రాతం ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వారి తరఫున నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశం కల్పించే కార్యక్రమం ఈనెల 27 న పాల్వంచ మండలంలో లక్ష్మీదేవి పల్లి గ్రామపంచాయతీ లో ని గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ఆపోజిట్ లో ఉన్న బిల్డింగ్ లో ట్రైనింగ్ సెంటర్ ఒక నెల రోజులు వరకు ఎలక్ట్రీషన్ జాబ్ మీద ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆ ఫౌండేషన్ డిస్టిక్ ఇంచార్జ్ ఎల్. చందులల్ ఇకప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగ యువతీ యువకులు ఈ చక్కటి అవకాశం అందరూ సద్వినియోగంచేసుకోవాల్సిందిగా కోరారు. అభ్యర్థుల వయసు..18 నుంచి 32 సంవత్సరాలు ఉండాలని, విద్యార్హత .. పదో క్లాస్ నుంచి డిగ్రీ,డిప్లమో,ఐటిఐ కేజలిగి ఉండాలని, ఎటువంటి ఫీజు లేకుండా ఒక నెల రోజులు శిక్షణ ఇవ్వబడునని,హాస్టల్ సౌకర్యం లేదని, డేస్ కలర్స్ సౌకర్యం కల్పించబడునని తెలిపారు.పూర్తి సమాచారం కొరకు 9866445473 నంబర్ సంప్రదించాలని కోరారు.

## సింగరేణి కార్మిక సంఘం ఐఎన్టీయూసీలో భారీ చేరికలు

చుంచుపల్లి, సూర్య(మేజర్‌న్యూస్) – మండల పరిధిలోని విద్యానగర్ కాలనీలోని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో వివిధ కార్మిక సంఘాల నుండి భారీ సంఖ్యలో సింగరేణి కార్మికులు ఐఎన్టీయూసీ కార్మిక సంఘంలో జాయిన్ అవ్వడం జరిగింది. పార్టీ లో చేరిన వారికి అశ్వరావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ అందరూ కష్టపడి పనిచేసి ఐఎన్టీయూసీని గెలిపించాలని ప్రతి కార్మికుడు కష్టపడి గెలిపించుకునే బాధ్యత మనందరి మీద ఉంద న్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడం. మన పార్టీకి సింగరేణి కార్మిక సంఘం అనుబంద సంఘమైన ఐఎన్టీయూసీని గెలిపించాలని. ఎంతోకాలంగా సింగరేణి సంస్థలు అపరస్కృతంగా ఉన్న సమస్యల నుండి పరిష్కారం లభిస్తుంద న్నారు.. ఈ కార్యక్రమంలో సింగరేణి కార్మిక సంఘ నాయకులు డాక్టర్ శంకర్ నాయక్ ప్రభాకర్, మల్లికార్జున్, ముప్పవరపు సోమిరెడ్డి, ఎండి రజాక్, మల్లికార్జున్.. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తూము చౌదరి ఆలమురళి, చీకటి కార్తీక్, నాగేంద్ర త్రివేది, సత్యనారాయణ రెడ్డి, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

